విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన జగన్ ప్రభుత్వం

నగరంలో విద్యార్థి, యువజనుల వినూత్న ప్రదర్శన

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ ఉద్యోగాలకు అభ్యర్థుల వయోపరిమితిని ఐదు సంవత్సరాలకు పెంచాలని, ప్రిలిమ్స్ పరీక్షకు 90 రోజులకు కాల పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన, నిరుద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో బిక్షాటన చేశారు. మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. 'సీఎం డౌన్ డౌన్', 'నిరుద్యోగులకు న్యాయం చేయాలి', 'ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి' 'వయోపరిమితిని పెంచాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే వలి, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణ కాంత్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో రాష్ట్రంలో ఉన్న 2.35 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఏడాదికి 6500 పోలీస్ ఉద్యోగాలను, డీఎస్సీ వేస్తామని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని నిరుద్యోగ యువతకు హామీనిచ్చారని అన్నారు. అధికారం చేపట్టిన తరు వాత ముదున్నరేళ్లల్లో నిరుద్యోగుల నెత్తిన శఠగోపం పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారని గుర్తుచేశారు. కానీ ప్రభుత్వం 6100 కానిస్టేబుల్, 411 ఎస్సై పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది, వయో పరిమితిని 27 సంవత్సరాలుగా, ప్రిలిమ్స్ ఎగ్జామ్ 44 రోజుల్లో పెడతామని ప్రకటించిందన్నారు. అయితే అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్‌లలో లక్షలాది రూపాయలు ఖర్చు చేశారని, వయస్సు దాటిపోవడంతో సుమారు 1.80 లక్షల మంది అనర్హులు అయ్యారని అన్నారు. ఈ ఉద్యోగాలకు ఇప్పటికే 8 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, తక్షణమే వయోపరిమితిని మరో 5 సంవత్సరాలకు పెంచాలని, ప్రిలిమ్స్ ఎగ్జామ్‌కు 90 రోజుల కాల పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.చైతన్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, ఎన్ఎస్‌యూఐ నగర అధ్యక్షులు కరీం, తెలుగు యువత అధికార ప్రతినిధి మహ్మద్ సీఫ్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశి, విద్యార్థి, యువజనులు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల ప్రతిపాదనలు సిద్ధం: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో నిషేధిత భూముల జాబితాలోని 21(ఇ)కి సంబంధించిన భూముల ప్రతిపాదనలు సిద్ధం చేశామని, సీసీఎల్ఏ కార్యాలయానికి వెంటనే అందిస్తామని కలెక్టర్ వేణుగోపాల రెడ్డి తెలిపారు. గురు వారం రాష్ట్ర సీసీఎల్ఏ కార్యాలయం నుంచి భూముల రీ సర్వే, రెవిన్యూ అంశాలపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ రెవిన్యూ సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలలో భూముల రీ సర్వేకి సంబంధించి ఇప్పటికి మిగిలిన ఉన్న గ్రామాలలో డ్రోన్ ఫ్లై వెంటనే పూర్తి అయ్యేలా ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. భూముల రీ సర్వేకి సంబంధించి జిల్లాలోని అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లై మూడు నెలలలో ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి డీఆర్ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, కో ఆర్డినేట్ సెక్షన్ సూపరింటెండెంట్ సిద్దార్ధ పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల సమాజాన్ని ఆదరించాలి

విశాలాంధ్ర-గుంటూరు : జన్యుపరమైన లోపాల వల్ల పుట్టిన పిల్లలలో అద్భు తమైన మేధాశక్తి, నైపుణ్యాలు దాగి ఉంటాయని, వారికి ప్రభుత్వంతోపాటు దాతల సహకారం కూడా తోడైతే అభివృద్ధికరమైన సమాజాన్ని చూడవచ్చునని ప్రముఖ పారిశ్రామికవేత్త, మద్ది లక్ష్మయ్య గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు అన్నారు. చతుర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో స్థానిక అమరావతి రోడ్డులోని సమర్ధనం దివ్యాంగుల సంస్థలో మద్ది వెంకటేశ్వరరావు లలిత దంపతులు ఏర్పాటు చేసిన 'బ్రెయిలీ డైజీ ఆడియో లైబ్రరీ'ని మద్ది వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమర్ధనం దివ్యాంగుల సంస్థ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ అధ్యక్షులు ఎంఆర్‌కే పరమహంస మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మూడు కేంద్రాల ద్వారా వందలాది మంది దివ్యాంగులకు రెసిడెన్షియల్ విధానంలో కంప్యూటర్ శిక్షణ అందిస్తూ ఆత్మవిశ్వాసాన్ని కలగజేయడంతో పాటు ఉద్యోగార్దులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమర్ధనం రీజినల్ హెడ్ పీవీకే శ్రీనివాస్, శిక్షకులు బి.శ్రీనివాస్, ఎల్.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దటమే ధ్యేయం

ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

విశాలాంధ్ర-గుంంటూరు వైద్యం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనే ధ్యేయంగా మొక్కవోని దీక్షతో మహా యజ్ఞం చేస్తున్నారని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. అందులో భాగంగానే అంద రినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే కాకుండా వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా విరి విగా కల్పిస్తున్నట్లు చెప్పారు. గుంటూరులో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నగర మేయర్ కావటి మనో హర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి, స్థానిక కార్పొరే టర్ కాంద్రకుంట గురవయ్య, విద్యాశాఖ అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా నిరుపేదల కుటుంబాల నుంచి డాక్టర్లు, ఇంజనీర్లను తయారు చేసిన ఘనత ఆయనకే చెల్లిందన్నారు. ఆయన తన యుడు వైఎస్ జగన్ పేదరిక నిర్మూలనకు సమూల మార్పులకు నాందీ పలుకుతూ అనేక పథకాలు రూపొందించారన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ అందరికీ ఉన్నత విద్యను అందుబాటులోకి తేవడం ద్వారా పేద కుటుంబాల తలరాతను మార్చిన ఘనత వైఎస్ జగ న్‌కే దక్కుతుం దన్నారు. ఇంగ్లీషు మీడియం విద్య, బైజూస్‌తో కూడిన ట్యాబ్‌ల పంపిణీ తదితరాల ద్వారా విద్యావ్యవస్థలోనే సరికొత్త విప్లవం సృష్టించా రని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, అందుకే అక్షరాశ్యతా క్రమంలో మన రాష్ట్రం అట్టడుగు నుంచి మూడో స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శైలజ, డిప్యూటీ డీఈవో సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ ఖుద్దూస్, కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, గేదెల రమేష్, బోడ పాటి కిషోర్, హైస్కూల్ హెడ్ మాస్టార్ రాంబాబు, ఎలిమెంటరీ స్కూల్ హెడ్ మాస్టార్ థామస్‌రెడ్డి స్థానిక నాయకులు నాగేశ్వరరావు, తిరుమలేశ్వరరావు, రవీంద్ర నాయక్, తోట వేణు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రైవేటు కళ్యాణ మండపాలకు ధీటుగా కమ్యునిటీ హాల్స్ నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధి కుంచనపల్లిలో నిర్మిస్తున్న యస్సి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కేటాయించిన రూ.50 లక్షల నిధులతో పాటు రూ.70లక్షల కార్పొరేషన్ నిధులు కలిపి మొత్తం రూ.1.20కోట్లతో హాలు నిర్మాణం పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్‌కు కంప్యూటర్ వితరణ

విశాలాంధ్ర-మంగళగిరి : పెదవడ్లపూడి గ్రామంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు, స్కూల్ నిర్వాహకుల అభ్యర్ధన మేరకు కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, కీబోర్డ్ సెట్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ టీడీపీ నాయకులతో గురువారం అందజేయించారు. ఆఫీస్‌లో కంప్యూటర్ లేక పడుతున్న ఇబ్బందులు గ్రామ పార్టీ ద్వారా లోకేష్‌కు తెలుపగా గురువారం స్కూల్‌లో నిర్వహించిన.. సెమి క్రిస్మస్ వేడుకలకు హాజరైన టీడీపీ నాయకులు లోకేష్ కంప్యూటర్‌ను స్కూల్ నిర్వాహకులు సిస్టర్ విజయ ప్రకాష్, పాస్టర్ బొక్క బాల సౌరీలకు అందజేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, టీడీపీ నాయకులు మాదల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వీడ్కోలు

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యధిక రేటింగ్ పొందిన జీఈసీ ఛానెల్ జీ తెలుగు ఫంటాస్టిక్ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నెల 25న సాయంత్రం 6 గంటలకు మొట్టమొదటిసారిగా ఫంటాస్టిక్ అవార్డులను అందించడం ద్వారా ఈ క్రిస్మస్ రోజున ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడానికి సిద్ధమౌతుంది. అద్యంతం హాస్యభరితంగా, వినోదాత్మకంగా నిర్వహించే ఈ ఫంటాస్టిక్ అవార్డు కార్యక్రమంలో టీవీ సెలబ్రిటీలు కొన్ని ఫన్నీ అవార్డులను పొందేందుకు పోరాటాలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జిటిక్ యాంకర్లతో పాటు జీ తెలుగు జోడిలు కూడా పాల్గొని మంత్రముగ్ధులను చేసే పర్ఫార్మెన్స్‌తో అందరి హృదయాలను గెల్చుకోనున్నారు. వీరితో పాటు మానస్, విష్ణు ప్రియ వైరల్ పాట జరీ జరీతో వేదికను రాక్ చేయనున్నారు. మున్నా-హర్షల, గోకుల్-దీప్తి, సిసిర్-నిసర్గ, పవన్-పద్మిని, యశ్వంత్-అంజనాల రొమాంటిక్ యాక్ట్‌తో అలరించనున్నారు. సాయి కిరణ్, ప్రీతి శర్మల పాటలు, సీరియల్ నటుల ప్రత్యేక స్కిట్లు, సూపర్ స్టార్ కృష్ణకు తన పాటలతో అకుల్ బాలాజీ అర్పించిన ఘన నివాళిని ఈ కార్యక్రమంలో ఉన్నాయి.

దేశం గర్వించదగ్గ మేధావి శ్రీనివాస రామానుజన్

విశాలాంధ్ర-గుంటూరు : ప్రపంచం గర్వించదగిన గణిత మేధావిగా గుర్తింపు పొందిన భారతదేశ ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ప్రాథమిక స్థాయి నుంచి గణితం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు గేరా మోహనరావు తెలిపారు. ప్రముఖ భారత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 135వ జయంతి సందర్భంగా గురువారం కాకుమాను మండల పరిధిలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (చర్చి కాంపౌండ్)లో జాతీయ గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గణిత మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని, అపార ప్రతిభాపాటవాలతో గణిత శాస్త్రంలో అనేక కొత్త సిద్ధాంతాలను కనిపెట్టారని చెప్పారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను ప్రదర్శించి ఆయిలర్ నియమాలు, త్రికోణమితికి చెందిన సమస్యలను సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత క్విజ్, గణిత పజిల్స్, గణితంతో ఆటలు మొదలగు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని మహమ్మద్ షహనాజ్ బేగం, విశ్రాంత హెచ్‌ఎం చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను సందర్శించిన డీఐ

విశాలాంధ్ర-మేడికొండూరు : మండలంలోని సిరిపురం గ్రామ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం గురువారం సందర్శించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు ఇబ్రహీంకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పాఠశాలలో ఉర్దూ మాధ్యమంలో బోధించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రుల వివరాలు పక్కగా నిర్వహించాలని సూచించారు. అమ్మఒడికి విద్యార్థుల హాజరు తగ్గకుండా ఉండేలాగా అవగాహన కల్పించాలన్నారు.

'సుమేధ'లో గణిత శాస్త్ర వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక ఎన్జీవోస్ కాలనీలోని సుమేధ హైస్కూల్లో గణిత శాస్త్ర పితామహుడైన శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను, ఆయన గణిత శాస్త్రంలో సాధించిన విషయాలను వివరించారు. వివిధ రకాల చార్టులు, నమూనాలను ప్రదర్శించడమే కాకుండా నృత్య రూపంలో, గాన రూపంలో చక్కగా వివరించారు. చిన్నారులు తాము చేసిన ఫన్ మాథ్స్ పజిల్స్, మోడల్స్‌ను సందర్శకులకు వివరణాత్మకంగా వివరించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గణితం మనిషి దైనందిన జీవితంలో భాగమని, దానిని విద్యార్థులు ఆసక్తితో నేర్చుకోవాలని విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పాలనను ప్రజల చెంతకు చేర్చేందుకు వారధిగా పని చేస్తున్న ఉద్యోగులు పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తోందని మేధావుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-ఉద్యోగుల కష్టాలు"అనే అంశంపై చర్చించారు. పీఎస్ మూర్తి మాట్లాడుతూ ఉద్యోగి ఫ్రెండ్లీ ప్రభుత్వం తమదని ప్రకటించుకున్న ప్రభుత్వం ఉద్యోగులు ఎడల నిర్లిప్త, నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుందనటానికి ఈ మూడున్నర ఏళ్లలో ఎన్నో ఉదంతాలు సాక్ష్యులుగా నిలిచాయన్నారు. 1వ తేదీన జీతాలు పొందటాన్ని కొన్నినెలలుగా ఉద్యోగులు మరిచిపోయారని, 10వ తేదీ లోపు జీతాలు పడితే చాలు అనుకునే దుస్థితి నెలకొందన్నారు. అనంతరం న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు అభద్రతలో ఉన్నారని, తాము దాచుకున్న డబ్బు, ఇతర బకాయిల చెల్లింపులు పెండింగేనని, డిఏలు, ఇతర భత్యాల గురించి చెప్పనలవికాదని, తమ సమస్యలుపై గొంతెత్తితే వారిపై ఏసీబీ, విజిలెన్స్ కేసులతో ప్రభుత్వం భయపెడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షనర్ సంఘ నాయకులు లూకాల మురళీకృష్ణ మాట్లాడుతూ ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై కేసులు, అరెస్టులతో ప్రభుత్వం యుద్ధం ప్రకటిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగుల కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు హామీ విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని, ప్రభుత్వం తమ తీరు మార్చుకోకపోతే ఉద్యోగులు, టీచర్లు ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలలో నూరిపోయటం ఖాయమని హెచ్చరించారు. రాబోయే ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఉద్యోగుల పట్ల పట్టు విడుపుల వైఖరి అవలంభించాలన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు చంద్రశేఖర్, వెంకటరత్నం ప్రసంగించారు.

దేశానికి ఆదర్శంగా విద్య వ్యవస్థ: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని దుగ్గిరాల బాలుర ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 586 మంది 8వ తరగతి విద్యార్థులకు, 74 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే గురువారం అందజేశారు. తొలుత భారత గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థలో జరుగుతున్న పెనుమార్పులు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. విద్య ప్రాథమిక హక్కని భారత రాజ్యాంగంలో రచించిన భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం ప్రకారం ఈ రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. విద్య ద్వారా తలరాతను మార్చుకోవచ్చని నిరూపించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ కుషి భాయ్ తదితరులు పాల్గొన్నారు.

అనుభవ వైద్య సంఘాల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా కొండలరావు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: అనుభవ వైద్య సంఘాల రాష్ట్ర ఫెడరేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా గుంటూరుజిల్లా ఫిరంగిపురం మండలానికి చెందిన పీఆర్ ఫేక్ కొండలరావు ఎంపికైనట్లు వ్యవస్థాపక అధ్యక్షులు రాజా సిద్దార్ధ తెలిపారు. గురువారం ప్రత్యేక కార్యక్రమంపై ఫిరంగిపురం విచ్చేసిన ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఫిరంగిపురానికి చెందిన వైద్యుడు కొండలరావు దీర్ఘ కాలంగా వైద్య వృత్తులో ఉంటూ అనుభవ వైద్య సంఘాలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ఆయనను ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్య శాలలో బుధవారం ఏర్పాటు చేసిన నూతన కమిటి ఎంపిక కార్యక్రమంలో నియమించారన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి నియామకానికి కారణమైన వ్యవస్థాపక అధ్యక్షులు రాజా సిద్దార్ధ, ఫెరేషన్ అధ్యక్షులు జీఎస్ ప్రసాదుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్య సంఘాల నాయకులు కొండలరావును శాలూవాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలోని ఆరెంపీ,పిఎంపీల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ అభ్యున్నతికి నిత్యం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

మహాప్రస్థాన పునరుద్ధరణకు వితరణ

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక స్తంభాల గురువు మహాప్రస్థానంలోని కమ్యూనిటీ హాలు పునరుద్ధరణ కోసం మామిళ్లపల్లి మాలకొండయ్య నాగమ్మల జ్ఞాపకార్ధం వారి కుమార్తె డాక్టర్ అరుణ, కుమారుడు శ్రీకృష్ణ రూ.5 లక్షలు, గడ్డిపాటి మురహరిరావు జ్ఞాపకార్ధం నన్నపనేని శేషగిరిరావు, సామ్రాజ్య లక్ష్మి గోళ్లమూడిపాడు వారు రూ.5 లక్షలు విరాళములను చెక్ రూపంలో సంస్థ సహాయ కార్యదర్శి వల్లూరి తాండవ కృష్ణకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వెలగపూడి లక్ష్మణరావు, కార్యదర్శి యార్లగడ్డ అంకమ్మ చౌదరి, కోశాధికారి లంక విజయసారధి, పూర్వ కార్యదర్శి దాసరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాప్రస్థానం సేవాసమితి దాతలకు ధన్యవాదాలు తెలియజేసింది.

అవార్డు అందుకున్న మామిడి అశోక్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎమినెన్స్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల గోవా రాష్ట్రంలో 'ఐ-కాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుల కార్యక్రమం జరిగింది. గుంటూరుకు చెందిన 'యూనివర్సల్ ఎడ్యుకేషన్ అకాడమీ 'ఐ-కాన్ ఆఫ్ ది ఇయర్' అవార్డును సొంతం చేసుకుంది. గోవా మాజీ ముఖ్యమంత్రి దిగంబర్ కామత్ చేతుల మీదగా యూనివర్సల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఎండీ డాక్టర్ మామిడి అశోక్ ఈ అవార్డును అందుకున్నారు. దీంతో గుంటూరు నగర ప్రజలు, వివిధ అకాడమీ, విద్యా సంస్థల అధినేతలు మామిడి అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

24న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర-గుంటూరు : ఈ నెల 24వ తేదీన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం గుంటూరులో నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొంటారని, విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తారని చెప్పారు.

'దీక్షారంబ్' విజయాలకు పునాది కావాలి

విశాలాంధ్ర-గుంటూరు : దక్షిణ భారతదేశంలోనే స్వాతంత్రానికి పూర్వం ఏర్పడిన రెండవ ప్రభుత్వ మహిళా కళాశాలలో చదివే విద్యార్థినులు ప్రతిజ్ఞతో జరుపుకునే 'దీక్షారంబ్' కార్యక్రమం ద్వారా ప్రతిభగల విద్యార్థినులుగా ఎదిగి ఉన్నత రంగాలలో స్థిరపడాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మొదటి మహిళా రిజిస్టర్ ఆచార్య బి.కరుణ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో 'దీక్షారంబ్ 2022-23' కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత గణిత శాస్త్ర పితామహుడు డాక్టర్ శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కరుణ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళల విద్య దేశగతినే మారుస్తుందని చెప్పినట్లు ప్రస్తుత సమాజానికి తగ్గట్లు మహిళలు విద్యావంతులవడం తప్పనిసరి అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వంలో మహిళా విద్యకు ప్రాధాన్యత అధికంగా ఉందని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మద్ది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్లోబలీకరణ నేపథ్యంలో విద్య ప్రాధాన్యత గుర్తెరిగి బాధ్యత గల విద్యార్థినీలుగా ర్యాగింగ్, మొబైల్ చాటింగ్‌లకు దూరంగా ఉంటూ ఎంచుకున్న రంగాలలో రాణించాలని కోరారు. కృష్ణా జిల్లా ఉప ఖజానా అధికారిని ముప్పాళ్ళ పల్లవి మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ, ద్వారానే కళాశాల పూర్వ విద్యార్థినిగా గ్రూప్ వన్ అధికారినిగా ఎదిగే అవకాశం కల్పించిందని తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో రాణించిన విద్యార్థినిలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సమర్ధనం ట్రస్టు ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. సభకు కళాశాల ప్రిన్సిపల్, ఆర్జేడీ డాక్టర్ వీఆర్ జోత్స్న కుమారి అధ్యక్షత వహించగా సమర్ధనం ట్రస్టు రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, విద్యార్థి సంఘం కన్వీనర్ కె.సుబ్బరత్నమ్మ, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డి.విజయశ్రీ, డాక్టర్ డి.ధాత్రి కుమారి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టి.సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్య విప్లవానికి నాంది

విశాలాంధ్ర-తెనాలి : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్ విప్లవానికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నాంది పలికారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. తెనాలి పట్టణ పరిధిలోని మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు గురువారం చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ స్కూల్‌లో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సంపన్న దేశాలకు మాత్రమే పరిమితమైన డిజిటల్ ఎడ్యుకేషన్‌ను పేద విద్యార్థులకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కు తుందన్నారు. వైఎస్సార్‌సిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని గుర్తుచేశారు. స్వీయ నియంత్రణ కలిగి ట్యాబ్‌లను దుర్వినియోగం చేసుకోకుండా డిజిటల్ విద్యను అందిపుచ్చుకునేందుకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ ఛైర్మన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావులు మాట్లాడారు. సెమిక్రిస్మస్ కేక్‌ను ఎమ్మెల్యే శివకుమార్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కమిషనర్ ఎం.జశ్వంతరావు, కౌన్సిలర్లు మానసరెడ్డి, జయపాల్, మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు డైరెక్టర్లు జ్యోత్స్న, రావి ప్రశాంతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో రామానుజన్ జయంతి

విశాలాంధ్ర-తాడేపల్లి: భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను కెఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిరోజును జాతీయ గణిత దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలోని గణిత అధ్యాపకులు, విద్యార్థులు శ్రీనివాసన్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణిత విభాగ అధిపతి డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ భారతీయ గణిత శాస్త్రవేత్తలలో రామానుజన్ పరిశోధనలు చెప్పుకోదగినవని అన్నారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులు, పరిశోధనా విద్యార్థులతో సెమినార్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారది వర్మ, ప్రో.వి.సి. డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గణితంతోనే మేధో వికాసం

విశాలాంధ్ర-గుంటూరు : ఆధునిక గణిత శాస్త్ర పితామహుడు డాక్టర్ శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు గణిత మేధావులుగా రాణించాలని ప్రజ్ఞ పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు అన్నారు. స్థానిక నగర పాలెం ప్రజ్ఞ విద్యాసంస్థలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వేగంగా మ్యాథమెటిక్స్ పోటీలు, మ్యాథమెటిక్స్‌లో క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయులు ఎండి సలీం, కె.సుధారాణి, సౌభాగ్య లక్ష్మి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ విభాగానికి చెందిన కుర్రా అనిల్ కుమార్ అనే విద్యార్థికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కార్యాలయం తెలిపింది. 'డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ రిలియబుల్ డిలే బేస్డ్ పీయూఎఫ్ ఆర్కిటెక్చర్స్ ఫర్ అథెంటికేషన్' అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని తెలిపింది. ఈ విద్యార్థికి యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎన్.ఉషారాణి గైడ్‌గా వ్యవహరించారని పేర్కొంది. ప్రస్తుతం సమాజంలో ఉన్న నకిలీ ఎలక్ట్రానిక్స్ పరికరాలను అతి సులభంగా గుర్తించడంలో ఈ విదార్థి చేసిన పరిశోధన ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ఈ పరికరాలను అతి సులభమైన సూక్ష్మ పరికరాలుగా తయారుచేయవచ్చు. ఈ విద్యార్థి తన పరిశోధనలో భాగంగా మొత్తం 6 స్కూపస్ జర్నల్ పబ్లికేషన్స్, 1 ఎస్‌సీఐఈ, 4 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేసింది. పీహెచ్‌డీ పట్టా పొందిన కుర్రా అనిల్ కుమార్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అభినందించారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి 'బెస్ట్ బ్రాండ్' అవార్డ్

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి 'బెస్ట్ బ్రాండ్ అవార్డు' లభించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఎకనామిక్స్ టైమ్స్' 2021-22 సంవత్సరానికి గాను ఉత్తమ బ్రాండ్ విద్యా సంస్థగా ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీని గుర్తించి అవార్డును ప్రకటించింది. ముంబై నగరంలో బుధవారం సాయంత్రం జరిగిన 'ది ఎకనామిక్స్ టైమ్స్' ఐదో వార్షికోత్సవ వేడుకల్లో ఈ అవార్డును అందజేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, మారికో గ్రూప్ ఛైర్మన్ హరష్ సి మారినాలా చేతుల మీదుగా అవార్డును యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమకుమార్ అందుకున్నారు. ది ఎకనామిక్స్ టైమ్స్ ఏటా వివిధ రంగాల్లో అత్యున్నత ప్రమాణా లను పాటించే సంస్థలను గుర్తించి జాతీయ స్థాయిలో అవార్డు లను ప్రదానం చేస్తుంది. ఇందులో భాగంగా 2021-22 సంవత్సరా నికి గాను ఉత్తమ బ్రాండ్ విద్యా సంస్థగా ఏపీ ఎస్ఆర్ఎంను ఎంపిక చేసింది. సంస్థ స్థాపన, అనుభవం, బ్రాండ్ వాల్యూ, వార్షిక టర్నోవర్, వృద్ధి రేటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏపీ ఎస్ఆర్ఎంను అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ కుమార్ అరోరా యూనివర్సిటీ ప్రగతికి దోహదపడ్డ ప్రొఫెసర్లు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో వర్సిటీని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. ముంబైలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి యూనివర్సిటీ తరపున రిజిస్ట్రార్‌తో పాటు యూనివర్సిటీ డీన్ డాక్టర్ భరద్వాజ్, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా హాజరయ్యారు.

ముస్తాబవుతున్న చర్చిలు

విశాలాంధ్ర-తాడికొండ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో క్రైస్తవ ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పండుగ సమీపిస్తుండటంతో ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మండలంలో 56కు పైగా క్రైస్తవ ఆలయాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రధాన కూడళ్ళు రహదారులలో క్రిస్మస్ శుభసూచకంగా స్టార్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. ఆలయాలను వివిధ రంగులతో అలంకరిస్తున్నారు. విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామాలలో సెమీ క్రిస్మస్, యూత్ క్రిస్మస్, మహిళా క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. క్రీస్తు పుట్టుక నాటికలను ప్రదర్శిస్తున్నారు. క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. షాపింగ్ మాల్స్, ఫ్యాన్సీ స్టోర్లు, చెప్పుల దుకాణాలు కళకళలాడుతున్నాయి. క్రిస్మస్ చెట్టును ఊరేగించేందుకు ఆయా గ్రామాలలో ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పేదవారి ఆరోగ్యానికి ప్రభుత్వం సంపూర్ణ భరోసా కల్పిస్తుందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని తెలిపారు. గురువారం నియోజకవర్గంలోని 29 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.20.33 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీని పూర్తి స్థాయిలో బలోపేతం చేసి, అనేక వ్యాధులను ఈ పథకంలో చేర్చామని తెలిపారు. ఇందులో లేని వ్యాధులకు శస్త్రచికిత్స చేయించుకొన్న వారికి సీఎం రిలీఫ్ పండ్ ద్వారా ఆదుకుంటామని వెల్లడించారు.

బాధితులకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ బాసట

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పేదవారికి అనారోగ్యం చేస్తే వారు తల్లడిల్లిపోతారని, అటువంటి వారికి చేయూత అందించి భరోసా కల్పించేందుకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ అండగా ఉంటుందని పౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా అన్నారు. గురువారం పట్టణంలోని సుభానినగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న 8 మందికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేసే కార్యక్రమంలో జాన్ సైదా పాల్గొని మాట్లాడారు. అనంతరం 8 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.40 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డ్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంటు శ్రీనివాసరెడ్డి, సొలస బీవీ రెడ్డి, షేక్ కరిముల్లా, ఎంవీ రత్నారెడ్డి, షేక్ కాలేషా వలి, మానుకొండ శేషి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, షేక్ మోహిద్దీన్, యుసూబ్, వలి, వైఎస్ జగన్ అభిమానులు పాల్గొన్నారు.

సంసిద్ స్కూల్‌లో గణిత ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రతీ విద్యార్థి శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకుని గణితంలో పట్టు సాధించాలని ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ అన్నారు. ప్రఖ్యాత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని మండలంలోని కనమర్లపూడి సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన సంసిద్ ఇంటర్నేషనల్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గణిత ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావుల్లో ఒకరైన గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిన్న వయస్సులోనే గణితంపై ప్రతిభ కనబరిచే వారని, అలాగే ప్రతీ విద్యార్థి రామానుజన్ స్ఫూర్తిగా కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. ఈకార్యక్రమంలో గణిత ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల పోస్టుల నోటిఫికేషన్

విశాలాంధ్ర-యద్దపాడు : మండల పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి స్థానిక ఎంపీడీవో వై.హనుమారెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి 29వ వరకు దరఖాస్తులను సేకరించి, 30 నుంచి 31వ తేదీల్లో పరిశీలించి, జనవరి 2వ తేదీన మౌఖిక పరీక్ష ద్వారా నియమించబడిన అభ్యర్థుల వివరములను మూడవ తేదీన విడుదల చేయనున్నట్లు వివరించారు. జనవరి 4వ తేదీన శిక్షణా తరగతి నిర్వహించి జనవరి 5 నుంచి ఆయా అభ్యర్థులు గ్రామ వలంటీర్లుగా పనులు ప్రారంభించనున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు. అభ్యర్థులు వారు అభ్యర్థిస్తున్న సచివాలయ పరిధిలో నివాసం ఉండి, 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణత పొందాలన్నారు. ఈ నెల 21వ తేదీ నాటికి 35 సంవత్సరాల వయస్సు లోపు వారే అర్హులన్నారు. మండలంలోని చెంఘీస్ ఖాన్ పేట గ్రామంలో ఎస్సీ జనరల్ కేటగిరిలో ఒకటి, కారుచోల పంచాయతీలో బీసీ జనరల్ కేటగిరిలో ఒకటి, మైదవోలులో గల మూడు ఖాళీలకు గాను ఒకటి బీసీ జనరల్, రెండు ఎస్సీ జనరల్, సందెపూడి పంచాయతీ పరిధిలో ఒక బీసీ జనరల్, తిమ్మాపురంలో ఒక బీసీ జనరల్, ఉన్నవ గ్రామంలో గల రెండు పోస్టులలో జనరల్ ఒకటి, ఎస్సీ జనరల్ ఒకటి పోస్టులు ఉన్నట్లు తెలిపారు.

ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయి: జంగాల

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సమితి సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. పెదకూరపాడు మండల పరిధిలోని 75 తాళ్లూరు చల్లపల్లి ప్రసాదరావు సీపీఐ కార్యాలయంలో గురువారం పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ కౌన్సిల్ సభ్యుల ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ సభ్యులు శరణం విజయ అధ్యక్షత వహించగా జంగాల మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చినాక ప్రజలపై ఆర్థికంగా భారాలు మోపి ప్రజలను శనిలా పీడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైసీపీ, బీజేపీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధానిపై స్పష్టమైన ప్రకటన ఇచ్చి అమరావతిని రాజధానిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల దేశవ్యాప్తంగా జరుగుతున్న సీపీఐ 98వ వ్యవస్థాపక దినోత్సవాన్ని వాడవాడలో ఎర్రజెండాలు ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలు రోజురోజుకు పెంచుకుంటూపోతూ ప్రజలపై భారాలు మోపారని అన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సీపీఐ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, చల్లపల్లి పానయ్య, చెన్నకేశవ, ఏనుగుల మధుబాబు, నున్న కోటేశ్వరరావు, పరగటి రాజు, దొడ్డ రాజు, మంత్రాలు, దోడ్డ రాజు, కంచేటి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులను ఆదుకోవాలి

జగనన్న ఇళ్ల లబ్ధిదారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెదకూరపాడు మండల పరిధిలోని 75 తాళ్లూరు చల్లపల్లి సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పథకం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వటంతో పాటు ఇల్లు కట్టించి గృహప్రవేశాలు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం నేడు జగనన్న కాలనీ ప్రజలను గాలికి వదిలేసిందన్నారు. జగనన్న కాలనీలో ఏర్పాటుచేసి సంవత్సరాలు గడుస్తున్న రాష్ట్రంలో ఎక్కడ కాలనీలు ప్రారంభించిన దాఖలు లేకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలలో ఇచ్చిన సెంటు, గ్రామాలలో ఇచ్చిన సెంటు న్నర స్థలం ఏమాత్రం సరిపోదని మూడు సెంట్లు, రెండు సెంట్లు వారికి ఇవ్వాలని సీపీఐ గతంలోనే రాష్ట్ర ప్రభు త్వానికి చెప్పిందని అనేక పోరాటాలు నిర్వహించామని గుర్తుచూశారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మొండిగా ప్రజలపై ప్రతిది పెంచుకుంటూ పోతూ మోయలేని భారాన్ని ఆర్థికంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆయన అన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వటం దుర్మా ర్గమైన చర్య అన్నారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభు త్వం ఒక ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, హుస్సేన్ మాట్లాడుతూ ప్రజానాట్యమండలి కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న టిడ్కో ఇళ్ళు పంపిణీ చేయాలని, అలాగని జగనన్న కాలనీ నిర్మించి ప్రజలను ఆదుకోవాలని వారన్నారు. ముఖ్యంగా అమరావతి రాజధాని కొనసాగించేంతవరకు సీపీఐ పోరాటాలు నిర్వహిస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా మునగోటి శ్రీనివాసరావు, చెన్నకేశవ, శరణం విజయ్, మధుబాబు, పున్న కోటేశ్వరరావు, కంచేటి పెద్దబ్బాయికి, చల్లపల్లి పానయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచండి

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ మజ్లీస్ పార్టీ, ఇతర ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఐదు సంవత్సరాలు వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆ పార్టీ అధ్యక్షుడు షేక్ బాజిద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న పోలీస్ శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ కొలువులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని, అయితే పోలీస్ శాఖలో విడుదల చేసిన మొదటి నోటిఫికేషన్ చూసిన నిరుద్యోగులు ఆశలు ఆవిరి అయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు.

అభ్యర్థుల వయోపరిమితి పెంచకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా రెండు లక్షల మందికిపైగా నిరుద్యోగుల జీవితాల్లో నీలినీడలు కమ్ముకున్నాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ వల్ల నిరుత్సాహపడిన నిరుద్యోగులకు ఊరటనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నబీ, నాసర్ వలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్‌కె నాయుడు, బీసీ సంఘం నాయకులు నాగమల్లేశ్వరరావు, మాల మహానాడు నాయకులు వెంకటేశ్వర్లు, పౌలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-వినుకొండ : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పల్నాడు జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో పాల్గొని ప్రభుత్వ జూనియర్ కళాశాల వినుకొండ విద్యార్థులు బహుమతులు గెలుచుకోవడం జరిగింది. నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ప్రథమ బహుమతి క్రింద రూ.3 వేలు నలుగురికి, ద్వితీయ బహుమతి క్రింద రూ.2 వేలు నలుగురికి, తృతీయ బహుమతి క్రింద రూ.1500 నలుగురికి నగదు అందజేశారు. బహుమతులు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ టి.ప్రభాకర్‌రావు, కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందనలు తెలియజేసారు. మొదటి బహుమతి పొందిన నలుగురిని ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగింది.

కొవిడ్‌పై డాక్టర్ గోపినాయక్ సూచనలు

విశాలాంధ్ర-యద్దపాడు : విదేశాలలో ఒక్కసారిగా విజృంభిస్తున్న నేపద్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూచనలను యద్దపాడు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ ఆర్.గోపి నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త వేరియంట్ బీఎఫ్ 7 నియంత్రణకు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలు బహిరంగ ప్రదేశాలలో మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని సూచించారు.

ఎప్పటికప్పుడు చేతులను కడుగుకొనుట, సబ్బు లేదా శానిటైజర్‌లను వినియోగించిన వివాహ, రాజకీయ, సామాజిక, సమావేశాలలో పాల్గొనరాదని కోరారు. అంతర్జాతీయ ప్రయాణాలను వద్దన్నారు. జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, లూజు మోషన్స్ తదితర లక్షణాలు ఉన్నవారు వైద్యులను సంప్రదించాలని, ప్రికాషనరీ వాక్సిన్ వేయించుకోవాలని జోడించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ సూచనలను పాటించవలసిందిగా డాక్టర్ గోపీనాయక్ ప్రజలను కోరారు.

నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-దుర్గి : ప్రిలిమ్స్ పరీక్ష సమయాన్ని 44 రోజుల నుంచి 90 రోజులకు పెంచాలని ఏఐవైఎఫ్ దుర్గి మండల కార్యదర్శి కాసుల లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రమైన దుర్గి గ్రంథాలయ ఆవరణలో గురువారం ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని ఐదు సంవత్సరాలు పెంచాలని, 2018 తరువాత పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేశారని, నాలుగు సంవత్సరాలుగా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో వేలకు వేలు ఫీజులు కడుతూ కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం వేచి చూస్తుంటే, వాళ్ళ ఆశల మీద నిరుగార్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వయస్సు పరిమితిని పెంచకుండా నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను అన్యాయం చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసే విధంగా నిర్ణయం తీసుకువాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కాలా శివయ్య, సహాయ కార్యదర్శి చిట్టిపోలు అమరేశ్వరరావు, బత్తుల భూదయ్య, వేమిరెడ్డి లచ్చిరెడ్డి, బత్తుల ఏడుకొండలు, వేముల గరటరావు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వెంటనే పూర్తి చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: పల్నాడు జిల్లాలో ప్రభుత్వ అవసరాల కోసం వ్యవసాయ రంగ భూముల సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నుంచి పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారులు, తహశీల్దార్లతో ప్రభుత్వ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ప్రభుత్వ అవసరాల కోసం వ్యవసాయ భూముల సేకరణ, షెడ్యూల్ కులాల సామాజిక వర్గాల అభ్యున్నతికి అవసరమైన భూములు, స్మశానవాటికలు ఏర్పాటు చేసుకునేందుకు, వారికి అందుబాటులో ఉండేలా భూములను సేకరించాలని ఆదేశించారు. జిల్లాలోని 28 మండలాలలో ఎస్సీ స్మశాన వాటికలు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎన్ని అవసరమనే అంశంపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. త్వరితగతిన స్మశాన వాటిక భూములను గుర్తించి, అంత్యక్రియలకు ఇబ్బంది పడుతున్న ఎస్సీలకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో రానున్న ఎన్నికలకు సంబంధించి స్పెషల్ సమ్మరీ రివిజన్- 2023 కార్యక్రమం జిల్లాలో వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల జాబితాను ప్రకటించే ముందు, కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తప్పులు సరి చేయడం, ఫోటో ఐడెంటిఫికేషన్, నకిలీ ఓట్ల తొలగింపు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని వేగవంతం చేసి జాబితాను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి అనిల్ కుమార్, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఎస్సైను కలిసిన సీపీఐ శ్రేణులు

విశాలాంధ్ర-దుర్గి : మండల పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన తురకా వెంకటరమణను గురువారం మండల సీపీఐ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి స్వీట్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద, సర్పంచ్‌లు చాట్ల శాంతరమేష్, మమ్ము శివరామకృష్ణలు ఎస్సైను శాలువాలతో సన్మానించి స్వీట్ బాక్స్ అందజేశారు. సన్మానించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి కాలా శివయ్య, సహాయ కార్యదర్శి చిట్టిప్రోలు అమరేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల ఏడుకొండలు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వేమిరెడ్డి లచ్చిరెడ్డి, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కాసుల లక్ష్మీనారాయణ, పోలేపల్లి కార్యదర్శి వేముల గరటారావు, సహాయ కార్యదర్శి బత్తుల బాలవీరయ్య, అడిగొప్పల కార్యదర్శి బత్తుల భూదయ్య, దంతాల అచ్చయ్య, శ్రీరాం కాశీబాబు, పంచాయతీ సెక్రటరీ వై.వెంకటేష్ ఉన్నారు.

పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-శావల్యాపురం : ప్రతి ఒక్కరూ ఇతరుల ఎడల ప్రేమ, దయ, జాలి కలిగి ఉండాని మండల ఎస్టీయూ అధ్యక్షులు బిళ్ళా రాజా రమేష్ అన్నారు. మండలంలోని తుమ్మలకుంట ఎంపీపీ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, కులమతాలకు అతీతంగా, శాంతికి ప్రతీకగా జరుపుకునేదే క్రిస్మస్ అని విద్యార్థులందరు కలిసి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు గీతారాణి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

విశాలాంధ్ర-దుర్గి : మండలంలో శాంతిభద్రత లకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా చర్య లు తప్పవని ఎస్సై తురకా వెంకటరమణ హెచ్చరిం చారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో గురువారం శాంతిభద్రతలు, గ్రామాల పరిశుభ్రతపై ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోవాలని, విరుద్ధంగా ప్రవర్తిసే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల ముందు డస్టబిన్లు ఏర్పాటు చేసుకోవాలని, నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉర్దూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద చెత్త కుండీలు, హైస్కూల్, గ్రోమోర్ మధ్య మూత్ర విసర్జన చేయకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని, అతిక్రమిస్తే రూ.500 అపరాధ రుసుము విధిస్తారని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరించినా, సైబర్ నేరగాళ్ల పట్ల వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మద్యం తాగే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దొంగతనాలు జరగకుండా దేవస్థానము వారు కమిటీతో చర్చించి, వారంలో ఒక్క రోజు హుండీలు తీసుకుని బ్యాంకులో జమ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా గణితదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం గణితదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 20వ శతాబ్దపు గణిత మేధావి గా గుర్తించబడ్డ శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలు జరిగాయి. శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు గణితం పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్ మాట్లాడుతూ శ్రీనివాసరామానుజన్ గణితంపై చేసిన ప్రయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, పి.మేరీస్వాతి, బి.లక్ష్మీపూర్ణిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు జాయింట్ సెక్రటరీ హోదా

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా సంయుక్త కలెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ కె.శ్రీనివాసులుకు జాయింట్ సెక్రటరీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం జేసీ శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలెక్టర్ శ్రీమతి కె.విజయ కృష్ణన్‌ను కలిశారు. అనంతరం జేసీకి కలెక్టర్ ప్రత్యేకంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర - కర్లపాలెం : మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మండల వీఆర్వోలు ఏర్పాటు చేసిన వేడుకలో తహశీల్దారు కేశవనారాయణ, ఏఎస్సై సాంబశివరావు, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొని క్రీస్తు మార్గం ఆచరణీయమని తెలిపి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ షెడ్రక్ క్రీస్తు సర్వమానవాళి శాంతిమార్గంలో నడిపేందుకు మానవ రూపంలో లోకానికి వచ్చారని భోదించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సీహెచ్. చంద్రశేఖర్, పగడం రమేష్‌రెడ్డి, శివారెడ్డి, యశ్వంతి, సుఖన్య, నాగరాజు తదితరులున్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీనివాస రామానుజన్ 135వ జయంతి వేడుకలను స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంపి వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు ఫణి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి ఖదర్ మాలను సమర్పించి గణితశాస్త్ర ప్రతిభను చాటి చెబుతూ శ్రీనివాసరామానుజన్ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు నారాయణం నాగలక్ష్మీ, కె. తిరుమల, పడమటి శిరీషా, వాగోలు సురేష్, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, వి.సుబ్బారావు, పప్పల దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు సూక్తులు పాటించి సంతోషంగా జీవించాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బాపట్ల : ఏసుక్రీస్తు బోధనలు, సూక్తులు పాటించి ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలని బాపట్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి తెలిపారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన క్రిస్మస్ కేకును కోసి అధికారులకు తినిపించారు. క్రిస్మస్ పండుగను అధికారికంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే యేసుక్రీస్తు సూక్తి ఆచరించాలన్నారు. ఆచారాలు, కులకట్టుబాట్లలో ఇరుక్కుని ఉండరాదని, మనిషిని మనిషిగా గౌరవించే తత్వం ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. పాస్టర్ల ప్రార్థనలే నాకు బలాన్ని ఇస్తున్నాయన్నారు. తనను తాను తగ్గించుకునే వాడే హెచ్చింపబడతాడనే యేసుక్రీస్తు సూక్తి నా జీవితంలో రుజువయ్యిందన్నారు. ఏసుక్రీస్తు పుట్టుకతోనే కాలాన్ని క్రీస్తు పూర్వం, క్రీస్తు శకంగా విభజించారని జిల్లా రెవెన్యూ అధికారిణి కె.లక్ష్మీ శివ జ్యోతి తెలిపారు. క్రీస్తు పుట్టుకతో ప్రజలలో సంతోషం వచ్చిందన్నారు. ప్రపంచమంతా జరుపుకునే క్రిస్మస్ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల తొలిసారిగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. యేసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సంక్షేమశాఖ అధికారిణి పి.ఝాన్సీరాణి తెలిపారు. అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, బాపట్ల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాబాన్‌రాజు, కర్లపాలెం పాస్టర్ల అసోసియేషన్ నాయకులు రమేష్, డాక్టర్ ఏ డానియల్ సాల్మన్, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పంట భూములు అన్యాక్రాంతం.. రైతుల ఆందోళన

భూముల పట్టాలను చూపుతున్న చింతమోటు రైతులు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ప్రభుత్వం అందజేసిన అసైన్డు భూమి అన్యాక్రాంతం చేశారని మండలంలోని చింతమోటు గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంత మండలంలోని పెదపులివర్రు గ్రామానికి సమీపంలో సర్వే నెం. 633-2పి, 655పి, 642పి నందు చింతమోటు గ్రామానికి చెందిన యలవర్తి ఏసుపాదం, యలవర్తి జయపాల్, కొక్కిలగడ్డ సుబ్బారావు, రావుల ఆదాము, రావుల సరోజిని, చిలకా యురేష్, గుంటూరు రాజేష్‌లకు ఒక్కొక్కరికి 75 సెంట్ల వంతున అసైన్డు భూమి ప్రభుత్వం అందించింది. సదరు రైతులు 50 సెంట్ల భూమిని సాగు చేసుకుంటూ సాగునీటి కొరత కారణంగా 25 సెంట్ల భూమిని పెదపులివర్రు గ్రామానికి చెందిన బాలకోటేశ్వరరావు అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. ప్రతి ఏటా సక్రమంగా కౌలు చెల్లిస్తున్న రైతు బాలకోటేశ్వరరావు గత ఏడాది మృతి చెందాడు. ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ సర్వేలో తమ భూములకు సంబంధించి పట్టాలు తీసుకుని వెళ్లగా సదరు కౌలుకు తీసుకున్న రైతు బాలకోటేశ్వరరావు భార్య, కుటుంబ సభ్యులు వచ్చి సదరు భూమి మాదని మీరు మాకు విక్రయించారు కాదా అని చెప్పడంతో పట్టా పొందిన రైతులు అవాక్కయ్యారు. భూములకు సంబంధించిన ఒరిజనల్ పట్టాలు మా దగ్గరే ఉన్నాయని మేము మీకు కౌలుకు ఇచ్చాము గాని ఎవరికి భూములు అమ్మకాలు జరపలేదని తెలియజేసినా కౌలు రైతు కుటుంబ సభ్యులు తహశీల్దార్ వద్ద ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు తమకు నోటీసులు జారీ చేశారని చింతమోటు రైతులు తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల తహశీల్దార్ ఎంఎల్ శ్రావణ్ కుమార్‌ను వివరణ కోరగా అసైన్డు చట్టం ప్రకారం అసైన్డు భూమిని సాగుచేసుకోవడమే కాని బదిలీ చేయడంగాని, అమ్మడం కాని కౌలుకు ఇవ్వడం నేరమన్నారు. ప్రభుత్వం ఎవరికైతే పట్టాలు పంపిణీ చేయడం జరిగిందో ఆ రైతులు మాత్రమే హక్కుదారులు అవుతారని ఇరు వర్గాలను విచారించి న్యాయం చేస్తామని తెలిపారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి: రమేష్

విశాలాంధ్ర-మాచర్ల: రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్స్ టెక్నీషియన్ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను వెంటనే మంజూరు చేయాలని ఆ సంఘం పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ దాసరి రమేష్ కోరారు. పట్ట ణంలో గురువారం ఆయన విలేకరుల సమా వేశాన్ని నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది కార్మికులు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్స్ కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఇప్పటికే ఎంతోమంది కార్మికులు తమ ప్రాణాలను పోగొట్టుకున్న సందర్భాలు లేకపోలేదన్నారు. తమరిని కూడా గుర్తించి కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఫలితం కనబడలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడి అలమటిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి గుర్తింపు కార్డులు, రుణాలను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర-వినుకొండ : ఎస్టీయూ మండల శాఖ అధ్వర్యంలో బుధవారం రాత్రి అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన వినుకొండలోని తెలుగు బాప్టిస్ట్ చర్చ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్టీయూ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు జోసఫ్ సుధీర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వినుకొండ మండల విద్యాశాఖాధికారి సయ్యద్ జపరుల్లా, పల్నాడు జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి చంద్రజిట్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణమ్మ, సత్తార్, యారగుంట్ల భాస్కర్, నెలపట్ల ప్రసాద్, ఏరియా కార్యదర్శి వేముల ఆంజనేయులు, కార్యదర్శి మోజెస్ హాజరయ్యారు. సుదీర్ బాబు మాట్లాడుతూ అందరూ క్రీస్తు మార్గంలోని గొప్పతనాన్ని తెలుసుకోవాలని, తన వలే తన పొరుగు వారిని ప్రేమించాలని అన్నారు. పాస్టర్ ఫిలిప్ మాట్లాడుతూ క్రీస్తు ఈ లోకంలో అందరిని రక్షించేందుకు వచ్చారని తెలియజేశారు. పాస్టర్ మహేష్ చీకటిలో ఉన్న ప్రజలను వెలుగులోకి నడిపించేందుకు యోహెూవా దేవుడు తన కుమారుడుని ఈ లోకానికి పంపడం అందరికి సంతోషదాయకమని అన్నారు. అనంతరం క్రిస్టమస్ కేక్ కట్ చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి దారా నాగేశ్వరరావు, ఈపూరు మండల నాయకులు కె.యోగేశ్వరరావు, జె.సుబ్బారావు, జి.ప్రతాప్, బాలకృష్ణ, బి.రాజా రమేష్ పాల్గొన్నారు.

కలుషిత తాగునీరు సరఫరా..

మసితో కూడిన రక్షిత మంచినీరు

తెల్లటి నురుగుతో కూడిన తాగునీరు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : సురక్షి తమైన తాగునీరు సరఫరా కావ ల్సిన రక్షిత మంచి నీటి పైపుల ద్వారా కలుషిత తాగునీరు సరఫరాతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో రక్షిత మంచినీటి పథకం ద్వారా నల్లటి మసితో కలసి దుర్వాసతో కూడిన నీరు సరఫరా అవుతుందని, తాగాలంటే భయం వేస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ముర గుతో కలసి తాగునీరు సరఫరా అవుతున్న పంచాయతీ అధికారు లకు, పాలక వర్గ సభ్యులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆరోపి స్తున్నారు. గతంలో ఇదే మాదిరిగా సరఫరా అవుతుందని తెలియజేయగా తూతూమంత్రంగా ట్యాంకులను శుభ్రం చేసి చేతులు దులుపుకున్నారని వారంటున్నారు. మురుగునీటిలో ఉన్న రక్షిత మంచినీటి పైపులు లీకులు ఏర్పడిన కారణంగా మురుగుతో కూడిన నీరు సరఫరా అవుతుందని ఈ నీటిని తాగడం ద్వారా ఏలాంటి అంటువ్యాధుల బారిన పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించి సురక్షిత నీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దేశ కీర్తిని గణిత శిఖరాలపై నిలిపిన రామానుజన్

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: మేధస్సుతో భారతదేశ కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై నిలిపిన వ్యక్తి శ్రీనివాస రామానుజన్ అని 75త్యాల్లురు జడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం అంకాళ్ల శాంత భూలక్ష్మి అన్నారు. గురువారం మండలం పరిధిలోని 75తాళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ జాతీయ గణిత దినోత్సవం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గణిత ఉపాధ్యాయులు మురళీకృష్ణ, సాంబశివరావు, వెంకటరమణ, ఉపాధ్యాయ బృందం, పిసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, తదితరులు రామానుజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కేక్ కట్ చేశారు. విద్యార్థులు గణిత ప్రాముఖ్యతపై గేయాలాపన చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించారు.

CHANGE OF NAME

I, **JC-271061L**, Sub (Gnr) Saranam Srinivasa Rao, R/o. H.No.16-5-105, Lal Bahadur Nagar, 2nd Line, Old Guntur, Guntur - 522001, Guntur District, A.P. My wife has changed her name from **JAYALAKSHMI** to **SARANAM JAYALAKSHMI** vide affidavit dated December 22, 2022, before the Notary Public at Guntur.

CHANGE OF NAME

I, **NUANE VENKATA REDDY** (Old Name), S/o. **NUNE SAMBI REDDY**, R/o. D.No. 5-72, Main Road, Peda Palakaluru, Guntur - 522005, Guntur District, A.P., have changed my name to **NUNE VENKATAREDDY**. Hereafter my name is known as **NUNE VENKATAREDDY**.

పాస్‌పోర్టు పోయినది

గుంటూరు సిటి, కృష్ణనగర్ 3/1వ లైను, వనమాలి టవర్స్, ఫ్లాట్ నెం. 502 కాపురస్తులు **గోపవరపు శివ సత్యనారాయణ గుప్తా గారి కుమారుడు గోపవరపు సాయి చైతన్య (సెల్: 93941 50546)** అను నేను నా పేరిట గల పాస్‌పోర్టు నెం. **N9111014 (జారీ చేసిన తేది 07-06-2016 మరియు గడువు ముగియు తేది 06-06-2026)** ఒరిజినల్‌ను ది. **15-12-2022**న గుంటూరు సిటి, పట్నంబజారులోని పాత వెల్‌కమ్ హోటల్ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా సదరు పాస్‌పోర్టు దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి సరైన సమయంలో సముచిత పదవులు కేటాయించి పార్టీ అభివృద్ధిలో వారి వంతు సహకారాన్ని కూడా తీసుకుంటుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. కష్టపడిన వారికి పార్టీ గుర్తిస్తుందని చెప్పడానికి మీరు పొందిన పదవులే కారణమన్నారు. వక్ఫ్ బోర్డు నూతన కమిటీ వైస్ ప్రెసిడెంట్ స్టార్ మస్తాన్, జాయింట్ సెక్రెటరీ షేక్ సుభాని, కమిటీ సభ్యులు ఉమర్ అలీలు తాడేపల్లి వైఎస్సార్ కేంద్ర పార్టీ కార్యాలయంలో గురువారం అప్పిరెడ్డిని మర్యాదపూర్వం కలిసి శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సభ్యులందరూ కలిసి పని చేసి వక్ఫ్ బోర్డ్ ఆస్తులను పరిరక్షించి పార్టీకి, అన్యాక్రాంతమైన ఆస్తులను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తిరిగి వక్ఫ్ బోర్డుకు చెందేవిధంగా చర్యలు తీసుకుని వక్ఫ్ బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. రానున్న ఎన్నికలలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ముస్లిం మైనార్టీలకు, ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల వద్దకు తీసుకెళ్ళేలా పటిష్ట ప్రణాళిక తయారు చేసుకొని పని చేయాలన్నారు. 2024 ఎన్నికల్లో 175కి 175 ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకై మీ వంతుగా కృషిచేసి మరల జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేయాల పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ ఇంచార్జి మల్లేశ్వరి అన్నారు. మండలంలోని అమీనాబాదు పంచాయతీ వేములూరిపాడు గ్రామంలో గల రైతు బరోసా కేంద్రానికి గురువారం విచ్చేసిన ఆమె డివిజన్ పరిధిలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు గురించి వివరించి అవగాహన కల్పించారు. డివిజన్ నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు రబీ సీజన్‌ల్లో రైతులు మినుము, పెసర, శనగ పంటలను పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు పండిస్తున్న రైతుల నుంచి వచ్చిన పంటలకు ప్రస్తుత మార్కెట్ కంటే 10నుంచి 15శాతం అధికంగా చెల్లించి దేవస్థానం వరకు కొనుగోలు చేస్తారని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 3సంవత్సరాల నుంచి ప్రకృతి పంటలు పండిస్తున్న రైతులను ఫార్ సైంటిస్ట్‌లుగా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులుగా ఎంపిక చేసి వారికి గౌరవేతనం ఇస్తారని, ప్రథమ సంవత్సరం ప్రతి నెల రు.10వేలు వరకు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో యం.టి. వీరలక్ష్మీ, ఎస్.డి.ఎ అన్నామణి, పిఆర్‌పి రామకృష్ణ, వివిఎ ప్రశాంతి, సీనియర్ ఐసిఆర్‌పి. ఇర్ల వెంకటేశ్వర్లు, లీడ్ ఫార్మర్లు, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మశీలో 'ఆన్‌లైన్ ప్లేస్‌మెంట్ టాక్ వెబినార్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మశీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఫినామ్ కంపెనీ, యూఎస్‌ఎ వారు ఆన్‌లైన్ ప్లేస్‌మెంట్ టాక్ వెబినార్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. ఫినామ్ ఇండియా మార్కెటింగ్ అండ్ సేల్స్ లీడర్ బిఎన్ కిషోర్ ఉద్యోగ అవకాశాలు గురించి శ్వాస జాబ్ ప్లాట్‌ఫార్మ్ ద్వారా విద్యార్థులతో మాట్లాడారు. ఈ వెబినార్‌లో బీ.ఫార్మశీ, ఎం.ఫార్మశీ, ఫార్మా.డి.డి.ఫార్మశీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్‌డి డాక్టర్ పి.సీతారామయ్య, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవానికి అనుమతివ్వండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సంఘం ఆదేశానుసారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లోని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీ ఎంఈయూ)కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఏపీ ఎంఈయూ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఏపీ ఎంఈయూ రాష్ట్ర అధ్యక్షులు వద్దె బాలయ్య జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సూపరింటెండెంట్‌కు, సీఎస్ ఆర్ఎంఓకు, నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్-1 అండ్ గ్రేడ్-2, ఇన్‌ఛార్జ్ సార్జెంట్‌లకు వినతి పత్రాలను బాలయ్య అందజేశారు. ముఖ్య అతిథులుగా జీజీహెచ్ సూపరింటెండెంట్, ఏఐటీయూసీ నాయకులు విచ్చేసి జెండా ఆవిష్కరణ చేయనున్నారని తెలిపారు. అదేవిధంగా యూనియన్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు తెలియజేయనున్నట్లు చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-తెనాలి : చైనాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో కోవిడ్-19 పాజిటివ్ కేసులు అనూహ్యంగా పెరుగుతుండటముతో కరోనా ముప్పు యింకా తొలగిపోనందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు పట్టణ ప్రజలు జాగ్రత్తగా ఉండవలెనని తెనాలి మునిసిపల్ కమీషనరు జశ్వంత్‌రావు గురువారం తెలిపారు. ప్రజలు గతంలో మాదిరిగా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జనరద్దీ ప్రాంతంలో సంచరిచువారు తప్పనిసరిగా మాస్కులు ధరించవలెను. అలాగే ప్రస్తుత పండుగల సీజన్ క్రిస్టమస్, నూతన సంవత్సర, సంక్రాంతి వేడుకలు సందర్భముగా పట్టణ ప్రజలు ప్రయాణాలు చేయునప్పుడు కాని, దేవాలయములు సందర్శన సందర్భముగా గాని, వర్తక, వాణిజ్య వ్యాపార కూడళ్ళలో వస్తు కొనుగోళ్ళు సందర్భమున గాని వేడుకలు నిర్వహణ, వివాహాది తదితర శుభకార్యాలలో పాల్గొను ప్రజలు తగు జాగ్రత్తలు వహించి తప్పనిసరిగా ప్రతిఒక్కరు మాస్కులు ధరించాలని చెప్పారు. ప్రజానీకం ధైర్యంగా ఉండాలని, వాతావరణ శాఖ జారీ చేసిన సూచనల ప్రకారం బలపడిన తీవ్ర అల్పపీడనం, చలిగాలులు ఎక్కువగా వీచే అవకాశం, వర్షాలు కురిసే అవకాశం వున్నందున పట్టణ ప్రజలు ముఖ్యంగా రైతాంగం ముందస్తు జాగ్రత్తలు పాటించవలసినదిగా తెలియజేశారు.

ఉత్సాహంగా వివా వీవీఐటీ యువజనోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు : వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా-వీవీఐటీ 2023-23 వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. రెండవ రోజు యువజనోత్సవంలో భాగంగా నిర్వహించిన సాంకేతిక, సాంస్కృతిక క్రీడలు యువతను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మారుమ్రోగింది. ఆట, పాటలతో విద్యార్థులు ఉర్రూతలు ఊగించారు. ప్రాజెక్టు ఎక్స్‌పో, పేపరు ప్రజంటేషన్, సర్క్యూట్‌ఎరా వంటి సాంకేతిక అంశాలలో విద్యార్థులు పెద్దమొత్తంలో పాల్గొన్నారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో క్రీడలు ఉత్కంఠతో సాగాయి. ఫోక్ డ్యాన్స్, ఆధునిక అష్టావధానం ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు వేడకలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, వీవీఐటీ కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఐయూసీఈఈ సభ్యులు దండు రామరాజు, లెఫ్టినెంట్ కమాండర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వైవీఎస్ఎస్ఎస్వీ ప్రసాదరావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

63 ప్రదర్శనలకు నోచుకున్న 'ఆలితో సరదాగా' నాటిక

చిలకలూరిపేట కళాసంస్థ ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ ద్వారా ప్రదర్శనలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చిలకలూరిపేట గతం నుంచి కళలకు, కళాకారులకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో అనేక కళాసంస్థలు ఉండవి. ఎక్కడో చోట కళాప్రదర్శలు నిత్యం కొనసాగేవి. అయితే నానాటికి వాటి ప్రలభ్యం తగ్గిపోయింది. అనేక కళాపరిషత్‌లు మూతపడ్డాయి. అయితే చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ ఇప్పటికీ తన కార్యకలాపాలను కొనసాగిస్తూ ఉంది. 2018లో తొలిగా శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య వారి పరిషత్‌తో ప్రస్థానం ప్రారంభించింది. ఈ కళాసంస్థ ద్వారా ప్రదర్శనలకు నోచుకున్న ఆలితో సరదాగా హాస్య నాటిక ఈ నెల 19న భిలాయ్ ప్రదర్శించారు. దీంతో ఇంతవరకు ఈ కళాసంస్థ ద్వారా ఈ నాటికను ఇంతవరకు 63 ప్రదర్శనలకు చేరుకోవటం ఒక ఎత్తయితే, అందులో ఎగ్జిబిషన్‌గా 29 పోటీల్లో ప్రదర్శించబడిన 34 పరిషత్‌ల్లో 5 చోట్ల ద్వితీయ, 3 చోట్ల తృతీయ, ఒక చోట జ్యూరీ బహుమతులను గెలుపొందింది. కాగా ఇటీవల భిలాయ్‌లో ప్రదర్శనా బహుమతితో పాటుగా ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటుడు, ఆహార్యం, జ్యూరీ ఇలా 5 వ్యక్తిగత బహూమతులు సాధించింది. ఈ నాటిక ద్వారా జి.లహరి 23 చోట్ల ఉత్తమ నటి/హాస్య నటి బహుమతులను పొందారు.

నటీనటులకు అవార్డులు...

వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్ 10, హరిబాబు 6, ఆహార్యానికి 6, షేక్ షఫీ 4, కొత్త శివరామ్ ప్రసాద్ 1, సంగీతం లీలా మోహన్ ఒకటి మొత్తంగా వ్యక్తిగత బహుమతులు అందుకున్నారు. నాటకరంగ మిత్రులు సైతం చూసినవారే అవకాశం దొరికిన చోటల్లా మళ్ళీ మళ్ళీ చూస్తూ ఆనందించారు, అభినందించారు. ఎన్నో సమాజాలకు ఇలా నాటకం ద్వారా అత్యధిక బహుమతులు పొందటం సర్వ సాధారణం. వారికన్నా ఈ బహుమతులు చాలా చాలా బహుస్వల్పం. కానీ హాస్య నాటిక ద్వారా గెలుపొందడం మా సమాజానికి ప్రత్యేకంగా చెప్పవచ్చు. ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్‌ను షఫీ పునఃప్రారంభించినప్పుడు కొందరు కొత్త నటులతో గతంలో ప్రదర్శించిన పాత హాస్య నాటికలను సరదాగా ఎక్కడైనా ప్రదర్శించాలి అనే ఆలోచన మాత్రమే కలిగిఉన్నప్పటికీ క్రమక్రమంగా కొత్త నాటికలను కూడా తయారుచేస్తూ, పడుతూ లేస్తూ, వెనుక ఎవరి అండదండలు లేకుండా స్వయంకృషి, క్రమశిక్షణ, చక్కని సాధనలతో ముందుకుపోతూ, నాటకరంగంలో ఈ గుర్తింపు పొందటం జరిగింది.

సుప్రీంకోర్టు తీర్పు సరికాదు..

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుజరాత్ మత ఘర్షణలో సామూహిక అత్యాచారానికి గురైన బిల్కిస్ భానో కేసు దేశాన్ని కుదిపేసిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. ఆమెకు సుప్రీంకోర్ట్‌లో న్యాయం జరుగుతుందని ఎదురుచూసిన మహిళా సంఘాల వారికి, అభ్యుదయ వాదులకు నిరాశే మిగిలిందన్నారు. తనపై ఈ దారుణానికి పాల్పడిన దోషులను గుజరాత్ ప్రభుత్వం ముందస్తుగా విడుదల చేయటంపై ఆమె సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఎదురు దెబ్బ తినడాన్ని మహి ళా లోకం జీర్ణిం చుకోలేకపోతుం దన్నారు. దోషులకు రెమిషన్ పాలసీని వర్తింపచేసే విషయంలో గతంలో ఇచ్చిన అనుకూల తీర్పును పునసమీక్షించాలన్న ఆమె అభ్యర్థనను కూడా సుప్రీంకోర్టు తిరస్కరించడాన్ని అవగాహన సంస్థ ఖండిస్తున్నట్లు చెప్పారు. సరిగ్గా గుజరాత్ ఎన్నికలకు ముందు నిందితులు విడుదల కావడమేకాక వారికి హారతులు, వీరతిలకాలు, ఘనస్వాగతాలతో అధికారపక్షం ఒక బలమైన రాజకీయ సందేశాన్ని కూడా ఇవ్వగలి గిందని దుయ్యబట్టారు. కుల, మత మారణ కాండలకు సంబంధించిన కేసుల్లో ముందస్తు విడుదల విషయంలో న్యాయస్థానాలు కఠినంగా వ్యవహరించినప్పుడే ప్రభుత్వాలు కూడా హద్దుల్లో ఉంటాయని సూచించారు. దేశాన్ని కుదిపేసిన ఇటువంటి తీవ్రమైన ఘటనలో సైతం న్యాయస్థానం విచిత్రమైన తీర్పులు ఇవ్వడం లాంటివి జరిగితే ఇకపై అత్యాచారం, హత్య కేసుల్లో యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ రాజకీయంగా పలుకుబడి ఉన్న శక్తులు ఉపశమనం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే ప్రమాదం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కళ్యాణం రామారావుకు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో గత 36సంవత్సరాలుగా ఎంఎన్‌ఓగా పని చేస్తున్న కళ్యాణం రామారావు అనారోగ్యంతో ఈ నెల 21వ తేదీన జీజీహెచ్‌లో చేరారు. దీంతో వైద్యులు వైద్యం చేస్తుండగా గురువారం తెల్లవారు జామున 5గంటలకు మృతి చెందారు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్‌లోని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీ ఎంఈయూ)కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వద్దె బాలయ్య ఆధ్వర్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 కెవి తులశమ్మ, షేక్.షమీనా బేగం (గ్రేడ్-2), కిరణ్మయి (గ్రేడ్-2),డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ ఝాన్సీలు పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ కళ్యాణం రామారావుకు రావాల్సినవన్నీ త్వరలో ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, బండారు రాంబాబు, ఇరికి శ్రీధర్, ఆర్.కోటేశ్వరరావు, షేక్.మస్తాన్‌బీ, బి.కుమారరాజా, సీహెచ్ కృష్ణ, ఆర్.కమలకుమారి, సీహెచ్ మాణిక్యం, ఎన్‌వీ మహాలక్ష్మీ, కె.భూలక్ష్మీ, సీహెచ్ మంగమ్మ, గ్రంధి వెంకటేశ్వర్లు, బీజే బాలాజీ, ఎం.రోజ్‌మేరీ తదితరులు సంతాపం తెలిపారు.

ఐసీహెచ్‌హెచ్ సెంటర్ ప్రారంభించిన చాగంటి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పథాలజీ విభాగం ఆధ్వర్యంలో నూతనం గా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఫర్ హిమోగ్లోబినోపతిస్, హిమోఫీలియా(ఐసీహెచ్‌హెచ్)సెంటర్‌ను గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవి గురువారం ఘనంగా ప్రారంభించారు. శరీరంలో విటమిన్లు లోపించడం వల్ల చాలా మందికి రక్తహీనత సమస్యలు ఎదురవుతాయని, వీటిని ముందుగానే గుర్తించడానికి ఐసీహెచ్‌హెచ్ కేంద్రం ఉపయోగ పడుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అన్నారు. ఈ కార్యక్రమంలో పథాలజీ హెచ్‌ఓడి డాక్టర్ అపర్ణ, ఆచార్యులు ఎం.రజని, పి.ఉమా ప్రసాద్, డాక్టర్ సింధూర, డాక్టర్ జి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంబటి రాజీనామా చేయాలి: శ్రీనివాస్

విశాలాంధ్ర-గుంటూ రు కార్పొరేషన్: మంత్రి అంబటి రాంబాబు తాను లంచాలు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాలు చేశారని, ఆరోపణలు నిజమేనని బాధితులు ఒట్టేసి చెప్తున్నా అంబటి ఎందుకు నోరు మెదపటం లేదని, అంబటి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీ వడ్డెర కుటుంబానికి చెందిన తురక వరలయ్య, గంగమ్మల కుటుంబానికి చేస్తున్న అన్యాయంపై గురువారం జిల్లా టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి, నేటి వరకు రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేకుండా పోయిందన్నారు. అరాచకం, విధ్వంసం, అవినీతి ఈ మూడు ఎజెండాలతోనే పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మల్లె ఈశ్వరరావు మాట్లాడుతూ కన్న బిడ్డను కోల్పోయి అనాధాలుగా ఉన్న వడ్డెర కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ డబ్బులు 5 లక్షలు వస్తే దానిలో అందులో 2.5 లక్షలు ఇస్తేనే మీకు చెక్కు ఇస్తామని అధికారుల దగ్గర నుండి మంత్రి అంబటి వరకు వారిని మానసికంగా కృంగదీయడం దారుణమన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో వుండి పేదలకు సహాయం చేయాల్సింది పోయి వారి ముక్కు పిండి మరీ డబ్బుల్ని వసూలు చేస్తున్నారంటే... ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకొకటి లేదన్నారు. కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాసరావు, బత్తుల జాన్ సైదా, తుమ్మేటి మురళి, చల్లా ఆంజనేయప్రసాద్, గట్టి శ్రీనివాసరావు, వేముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు' రోహిణి మహేష్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 23, 24 తేదీలలో విజయవాడలో జరగనున్న 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు గుంటూరు నగరానికి చెందిన ఆధ్యాత్మిక రచయిత, శ్రీహంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం మెంబర్ అయిన రోహిణి మహేష్ ప్రతినిధిగా వెళ్ళనున్నారు. వీరు గతంలో జరిగిన 2వ(2011), 3వ(2015), 4వ(2019) ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు...అలాగే 2016 ఒంగోలులో జరిగిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవాలు, 2017 తిరుమలలో జరిగిన అంతర్జాతీయ హిందూ ధార్మిక సమ్మేళనంలోనూ ప్రతినిధిగా పాల్గొన్నారు.

24న జయచిత్ర, మురళిమోహన్‌లకు ఎన్టీఆర్ పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈ నెల 24న తెనాలిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదగా సినీ నటులు జయచిత్ర, మురళీమోహన్‌లకు ఎన్టీఆర్ పురస్కారం ఇవ్వనున్నట్లు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జస్టిస్ ప్రత్యేక అతిథిగా, ఎన్టీఆర్ పెద్ద కుమార్తె గారపటి లోకేశ్వరి పాల్గొంటారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసినదిగా కోరారు.

ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను మోచేతి నీళ్లు తాగించే వ్యవస్థగా మార్చింది

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను వైసీపీ మోచేతి నీళ్లు తాగించే వ్యవస్థగా మార్చిందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. రౌడీలు, గుండాలకు అడ్డాగా తయారైంది అనటానికి మాచర్ల ఘటనే ఉదాహరణగా పేర్కొన్నారు. మాచర్ల ఘటనపై సెక్షన్ 30 అమలులో ఉందని డిఐజి మీడియా ముందు చెప్పిన మాట మరిచిపోయి బాధితులపైనే పలు సెక్షన్ల కింద అక్రమ కేసులు నమోదు చేసి చోద్యం చూస్తున్నారు. పల్నాడులో దాడులు, హత్యలు, దోపిడీలు, దగ్ధం చేయడం వంటి విధ్వంస కార్యక్రమాలు చేస్తున్న వారిని వదిలేసి టీడీపీ వారిపై కేసులు పెడతారా అని ప్రశ్నించారు. మంత్రి అంబటి రాంబాబు మీడియా ముందుచెప్పే మాటలు వేరు.. విడిగా చేసే పనులు వేరన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పిల్లి మాణిక్యరావు, చిట్టాబత్తిన శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, శాఖమూరి నారాయణ ప్రసాద్, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, వేములకొండ శ్రీనివాస్, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో గణిత శాస్త్రం కీలకం

విశాలాంధ్ర-గుంటూరు : అన్ని రంగాల్లో గణిత శాత్ర పాత్ర ఉంటుందని, ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే లెక్కలు, గణితంపై పట్టు సాధించుకోవాలని విజ్ఞాన్ పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. గురువారం గణిత శాస్త్రవేత్త రామానుజం జన్మదినం సందర్భంగా నిర్వహించే గణిత దినోత్సవం వేడుకలు గుంటూరు, ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గణితశాస్త్రంపై పలు పోటీలను విద్యార్థులకు నిర్వహించారు.

వలంటీర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-వెల్దుర్తి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వార్డు వలంటీర్ల ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మండలంలో ఉప్పలపాడు, కండ్లకుంట, సిరిగిరిపాడు, పట్లవీడు. వజ్రాలపాడు, కేపీ గూడెం తదితర గ్రామాలలో 7 వలంటీర్ల పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 272 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ నుంచి 29 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. దరఖాస్తుల పరిశీలన మౌఖిక పరీక్షలు నిర్వహించిన తర్వాత అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉండాలని ఎంపీడీవో తెలిపారు.

విద్య వెలకట్టలేని ఆస్తి: శౌంరిరెడ్డి

విశాలాంధ్ర-రెంటచింతల : విద్యతోనే పేద విద్యార్థుల భవిషత్ మారుతుందని బలంగా నమ్మిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. పాలువాయి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి హాజరయ్యారు. ముందుగా హైస్కూల్ ప్రాంగణంలో చదువులతల్లి సరస్వతి విగ్రహానికి, గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక పాత భవనాలతో అధ్వానంగా ఉన్నాయని, నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపురేఖలు మార్చి విద్యార్థులకు అధునాతన సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి మాట్లాడుతూ ఇక్కడ హైస్కూల్లోనే నాడు-నేడు నిధులతో అందంగా తీర్చిదిద్దటంతోపాటు విద్యార్థులకు సరిపడ నూతన భవనాలు నిర్మించటం జరిగిందన్నారు. అంతేకాకుండా నేడు 8వ తరగతి నుంచే విద్యార్థుల్లో మెరుగైన జ్ఞానం పొందాలనే ఉద్దేశంతో బైజూస్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో ట్యాబ్ ద్వారా విద్యను అందించనున్నామన్నారు. అందులో భాగంగానే నేడు హైస్కూల్లోని విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, తరగతి గదిలో ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యంతోపాటు అధునాతనమైన మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ మండలపు విజయలక్ష్మీ లచ్చిరెడ్డి, ఎంపీటీసీ గుంటా ముక్కంటేశ్వర రెడ్డి, ఎంపీడీఓ షేక్ గౌస్యా బేగం, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మోర్తల ఉమామహేశ్వర రెడ్డి, మండలపు హనిమిరెడ్డి, కొక్కండ్ల బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ

విశాలాంధ్ర-యడ్లపాడు : రానున్న క్రిస్మస్ పర్వదిన సందర్భంగా మండలంలోని కొండవీడు గ్రామానికి చెందిన అంబేద్కర్ స్టార్ క్రికెట్ టీం యూత్ ఆధ్వర్యంలో చెంఘిస్‌ఖాన్ పేట, కొండవీడు, పుట్టకోట, కోట, గణేసునివారిపాలెంని గ్రామాల్లోని యువకులకు గత ఐదు రోజులుగా కొండవీడు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలైన కొండవీటి టీంకు రూ.8116లు, రన్నర్స్‌గా నిలిచిన చెంఘిస్‌ఖాన్ పేట టీంకు రూ.5116లు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు చేతుల మీదుగా అందజేశారు.

పొన్నెకల్లులో సెమీ క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-తాడికొండ : పొన్నెకల్లు గ్రామ ఆల్మీగ్ టి చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. పాస్టర్ పులి మత్తయ్య మాట్లాడారు. క్రీస్తు పుట్టుక క్రిస్మస్ ప్రాధాన్యత గురించి సందేశాన్ని ఇచ్చారు. క్రీస్తు సందేశంలో శాంతి సమాధానం ఉంటుందని తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పులి జాన్ పాల్, జోసెఫ్ శామ్యూల్, ఆనంద్ కిరణ్, విశ్వాసులు పాల్గొన్నారు.

సుస్థిర సమీకృతాభివృద్ధి ఫలాలపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-దుర్గి: సుస్థిర సమీకృతాభివృద్ధి లక్ష్యాల ఫలాలు సాధించేందుకు సంబంధిత శాఖల సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపీడీవో గుప్తా అధ్యక్షతన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో గుప్తా మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి ఫలాలకు సంబంధించిన ఎనిమిది ఇండికేటర్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్, అంగన్వాడీ సూపరువైజర్ నాగేంద్రం, ధర్మవరం సర్పంచ్ జి.వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, మహిళా పోలీసులు, డబ్ల్యూఈఎలు పాల్గొన్నారు.

25న ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-యడ్లపాడు : యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం గ్రామానికి చెందిన విజన్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం యడ్లపాడులోని పీఆర్ విజ్ఞాన కేంద్రంలో షుగర్, బీపీలకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయా కమిటీల వారు తెలిపారు. క్యాంపు పర్యవేక్షకులుగా డాక్టర్ లింగమల్ల మోహన్ భాస్కర్ పాల్గొన్నట్లు, డాక్టర్ కందుల రంగారావు, డాక్టర్ నూతలపాటి షణ్ముఖం, డాక్టర్ జి.సుమ తమ సేవలను అందించనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత

విశాలాంధ్ర-మాచర్ల: పేదలకు నాణ్యమైన విద్యను అందించడమే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పిబాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు విద్య భారం కాకూడదని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు ట్యాబ్ లను అందజేయడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పీఆర్కేను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జడ్పీటీసి మల్లు స్వామి, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షులు కుర్రి సాయిమార్కొండా రెడ్డి, వైసీపి సీనియర్ నాయకులు శ్రీనివాస శర్మ, ఎరబోతుల శ్రీనివాసరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఉప్పలపాడు జానీ, కమీషనర్ ఏలూరి వెంకట రమణ బాబు, ఎంఈఓ వేముల నాగయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభించిన ఎంఈవో

విశాలాంధ్ర-దుర్గి: మండల కేంద్రమైన దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిమలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్. తోటకూర వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు పి.మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్లకు వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి: పట్టణ 16వ వార్డు నందు తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపిన క్రిస్టమస్ కానుకలను పాస్టర్‌లకు అందజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందర రావు యాదవ్, నియోజకవర్గ టీఎన్‌టీయూసి అధ్యక్షులు కేటీవీ ప్రసాద్, తాడేపల్లి పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంభం సాయిచంద్, తాడేపల్లి పట్టణ బీసీ సెల్ కార్యదర్శి కటారి తిరుపతిరావు, పట్టణ టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శులు తాడేపల్లి కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నారెడ్కో క్యాపిటల్ జోన్ ప్రాపర్టీ షో

విశాలాంధ్ర-గుంటూరు : నారెడ్కో క్యాపిటల్ జోన్ గుంటూరు 10వ ప్రాపర్టీ షో-2022 ఈ నెల 23, 24, 25 తేదీలలో గుంటూరు రింగ్ రోడ్డులోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు నారెడ్కో ఛైర్మన్ హరిబాబు, ఏపీ ప్రెసిడెంట్ నగేష్, సెక్రటరీ జనరల్ మామిడి సీతారామయ్య, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ బత్తుల సురేష్ బాబులు తెలిపారు. గుంటూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాపర్టీ షోకి ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, మహమ్మద్ ముస్తఫాలు హాజరుకానున్నట్లు వివరించారు. నిర్మాణ రంగానికి సంబంధించిన 60 స్టాల్స్‌ను ఈ ప్రాపర్టీ షోలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థిరచరాస్తులు కొనుగోలు చేయడానికి ఓపెన్ ప్లాట్స్, విల్లాస్, అపార్ట్‌మెంట్స్ బుక్ చేసుకోవడానికి ఇది ఒక మంచి సదవకాశమని అన్నారు. విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ఓపెన్ ప్లాట్స్ బుక్ చేసుకునే వారికి స్పెషల్ డిస్కౌంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పి.మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రాపర్టీ షోలో ప్రతి గంటకు లక్కీ డ్రా తీస్తారని, విజేతలకు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బత్తుల సురేష్ బాబు, టి.యోగయ్య, యాగంటి దుర్గాప్రసాద్, మల్లికార్జున రావు, హరిశంకర్ రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ రావూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.